
పెద్దపల్లి: ఈవీఎంలకు సీల్ వేస్తున్న పోలింగ్ సిబ్బంది


జ్యోతినగర్ : పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు


సుల్తానాబాద్ రూరల్:గర్రెపల్లి పోలింగ్ కేంద్రంలో క్యూలో ఓటర్లు

# బారులు తీరి.. ఓటు వేసి

గోదావరిఖని/యైటింక్లయిన్ కాలనీ/ కోల్‌సిటీ/ ఫర్టిలైజర్‌సిటీ/ జ్యోతినగర్, నవంబర్ 30: రామగుండం నియోజక వర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువాం ప్రశాంతంగా ముగిసింది. రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. నియోజక వర్గంలోని 260 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6.30 గంటల వరకు సాగింది. 5 గంటల వరకే పోలింగ్ ముగియాల్సి ఉంది కొన్ని కేంద్రాల్లో 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి రాత్రి చాలా ఆలస్యమైంది. రామగుండం నియోజక వర్గంలోని 260 పోలింగ్ స్టేషన్‌లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రామగుండంలో మొత్తం 221019 ఓట్లకు గాను పురుషులు 111200 ఓట్లు, మహిళలు 109794 ఓట్లు, ఇతరులు 25 ఓట్లు న్నాయి. రాత్రి 8 గంటల వరకు దాదాపు 50 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది. సమస్యాత్మక గ్రామాలు లేనప్పటికీ భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలు ఉండటం వల్ల దాదాపు 3వేల పై చిలుకు సిబ్బంది ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి వచ్చింది. రామగుండం అయోధ్య నగర్‌లో ఈవీఎంలో సాంకేతిక సమస ఏర్పడి 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచింది. గోదావరిఖని టూటౌన్ సీఐ సూరం వేణుగోపాల్ పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. పోలింగు కేంద్రాలను బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్, కాంగ్రెస్ అభ్యర్థి రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణి, స్వతంత్ర్య అభ్యర్థి సోమారపు సత్యనారాయణలను పరిశీలించారు.


పెద్దపల్లి కమాన్: రంగాపూర్‌లో ఓటు వేసేందుకు బారులుతీరిన ప్రజలు

**పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ**

నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు రాజేశ్‌సింగ్ రాణా రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీతో కలిసి పర్యవేక్షించారు. ఖాజిపల్లి, స్పెక్ట్రా స్కూల్లో పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. 56వ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయెధ్యనగర్‌లో జరిగిన పొలింగ్‌లో ఈవీఎంలో సాంకేతిక లోపం తలెత్తగా 20నిమిషాల పాటు అంతరాయం కలిగినట్లు తెలిసింది. కాగా పలు బూత్‌ల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత ఆనందంను వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. లక్ష్మీనగర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం అరగంట సేపు ఈవీఎం మొరాయించింది. మధ్యాహ్నం 3 గంటల వరకు రామగుండంలో పురుషుల ఓటింగ్ శాతం 49.10 నమోదు కాగా, మహిళల ఓటింగ్ శాతం 49.55 శాతంగా నమోదైనట్లు తెలిపారు. కాగా, ఈసారి ఓటింగ్‌కు మహిళలు ఎక్కువగా ఆసక్తి కనబరిచారు. పోలింగ్ ముగిసే సమయానికి 5 గం.ల వరకు పురుషులు 66.97 శాతం, మహిళలు 66.69 శాతం మొత్తంగా రామగుండం నియోజక వర్గంలో 66.83 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.


జ్యోతినగర్ : పోలింగ్ ముగించుకోని ఆర్వో కార్యాయానికి వస్తున్న ఎన్నికల అధికారులు

**ఆర్వో కార్యాలయానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది**

రామగుండం నియోజకవర్గంలోని 260 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రితో తరలివెళ్లిన పోలింగ్ సిబ్బంది గురువారం సాయంత్రం 5గంటలకు పోలింగ్ ముగియడంతో రాత్రి 10గంటలకు వరకు ఎన్టీపీసీలోని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంకు తిరిగి వచ్చారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో ఓటింగ్ నమోదు అయిన వీవీ ఫ్యాడ్‌లు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, స్టాటిక్స్ పేపర్స్‌ను ఎన్నికల అధికారులకు అందజేశారు. అనంతరం పోలింగ్ సామగ్రిని పరిశీలించిన ఎన్నికల అధికారులు ఈవీఎం మిషన్‌లను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి ఓటింగ్ నమోదును లెక్కించారు. పోలింగ్ సామగ్రిని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ పర్యవేక్షించారు. అనంతరం ఈవీఎంలను భారీ పోలీసు బందోబస్తు మధ్య సెంటనరీకాలనీలోని మంథని జేఎన్టీయూ కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలించనున్నారు.

**పెద్దపల్లిలో ప్రశాంతంగా పోలింగ్..**

పెద్దపల్లి కమాన్, నవంబర్ 30 : పెద్దపల్లి మండలంలోని 30 గ్రామాల్లో గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరిగింది. ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలోని పోలింగ్‌స్టేషన్‌ను జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు. పెద్దపల్లి ఎంపీపీ బండారి స్రవంతి–శ్రీనివాస్ గౌడ్ దంపతులు గౌరెడ్డిపేటలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.భోజన్నపేట గ్రామంలోని 86వ బూత్‌లో ఈవీఎం మొరాయించగా, అధికారులు సరిచేసి మళ్లీ పోలింగ్ జరిగేలా చేశారు.

**కాల్వశ్రీరాంపూర్‌లో**

కాల్వశ్రీరాంపూర్ , నవంబర్30: మండలంలోని 41 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మల్యాలలోని138 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం గంట పాటు పని చేయలేదు. పోలింగ్ సరళిని పెద్దపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా పోలీస్ అధికారులు వేర్వేరుగా పరిశీలించారు. ఎస్‌ఐ శ్రీనివాస్ కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహించారు. పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్, గంగారం, వెన్నంపల్లి లో పోలింగ్ కేంద్రాల్లోనే ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య కొంతసేపు వాగ్వివాదం జరిగింది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. గంగారంలో సర్పంచ్ మల్లారెడ్డి తమకు డబ్బులు ఇవ్వలేదని గ్రామస్థులు అతన్ని నిలదీశారు. మండలంలో 34226 మంది ఓటర్లు , 1థర్డ్ జెండర్ ఓటు ఉన్నారు.

**జూలపల్లి మండలంలో...**

జూలపల్లి, నవంబర్ 30 : మండల వ్యాప్తంగా గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. జూలపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 278 పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మోరాయించడంతో గంటసేపు పోలింగ్ నిలిచిపోయింది. మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఆయన సతీమణి ప్రీతిరఘువీర్‌సింగ్, కోనరావుపేటలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, తేలుకుంటలో జడ్పీటీసీ సభ్యుడు బొద్దుల లక్ష్మణ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వడ్కాపూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి సందర్శించి పోలింగ్ తీరును తెల్సుకున్నారు. మండలంలో 21,456 మంది ఓటర్లకు 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో 85 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ బషీరొద్దీన్ వెల్లడించారు.


పెద్దపల్లి కమాన్: ఓటు హక్కు వినియోగించుకున్న పెద్దపల్లి ఎంపీపీ దంపతులు

**ఓదెలలో**

ఓదెల, నవంబర్ 30: మండలంలోని 22గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. 40పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందుకు ఎన్నికల సంఘం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దాసరి దాసరి మనోహర్‌రెడ్డి గుంపుల గ్రామాలన్ని సందర్శించి ఓటింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. అవాంచనీయ ఘటనలు జరగకుండా రామగుండం సీఐ శంకరయ్య, పొత్కపల్లి ఎస్‌ఐ శ్రీధర్‌లు గ్రామాల్లో గస్తీ తిరిగారు.

**సుల్తానాబాద్‌లో..**

సుల్తానాబాద్‌రూరల్,నవంబర్ 30: మండల వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ముందస్తుగా సుల్తానాబాద్ సీఐ జగదీశ్, ఎస్‌ఐ విజేందర్‌లు పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. ప్రజలు వారి ఓట్టు హక్కును వినియోగించుకునేలా చర్యలను అధికారులు చేపట్టారు.

**ధర్మారంలో..**

ధర్మారం,నవంబర్30: మండలంలో అసెం బ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.మండలంలో 44,396 ఓట్లు ఉండగా 36,245 మంది ఓటు హక్కును 53 పోలింగ్ కేంద్రాలలో వినియోగించుకున్నారు. ఇందులో స్త్రీలు 18,404 మంది ఓటు వేయగా, పురుషులు 17,841 మంది ఓట్లు వేశారు. మహిళలు 563 మంది అధికంగా ఓటు వేశారు. కాగా పోలీసు బందోబస్తు మధ్య ప్రశాతంగా ఎన్నికలు జరిగాయి. ధర్మారం,నంది మేడారం,గోపాల్‌రావుపేట గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ధర్మపురి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ సందర్శించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. కొత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 166 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో అరగంట పాటు అంతరాయం కల్గింది. ధర్మారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేయడంతో డీఎస్పీ శ్రీనివాస్ అక్కడకు చేరుకొని వారిని వారించారు. చామనపల్లి గ్రామంలో 111 మంది యువతీ యువకులకు కొత్తగా ఓటు హక్కు రాగా వారి కోసం ఏర్పాటు చేసిన యూత్ మోడల్ పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖిలావనపర్తిలో సాయంత్రం సమయంలో పోలింగ్ కేంద్రానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో రాత్రి 7:30 గంటల దాకా పోలింగ్ న్విహించారు. కాగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ రజిత అధ్వర్యంలో ఎంపీడీవో జయశీల, మిషన్ భగీరథ డీఈఈ రోహిత్,ఎంపీవో రమేశ్,పీఆర్ ఏఈ రాజశేఖర్, నీటి పారుదల శాఖ ఏఈ శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత బస్సుల్లో ఈవీఎంలను జగిత్యాలలోని కౌంటింగ్ కేంద్రానికి పోలీసు బందోబస్తు మధ్య తరలించారు.

**రెండు పోలింగ్ బూత్‌లలో ఓటు వేసిన వ్యక్తిపై కేసు నమోదు**

బొట్లవనపర్తికి చెందిన ఆకారి సత్యం రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయగా అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యం బొట్లవనపర్తి లోని 158 పోలింగ్ కేంద్రంలో ఓటు వేశాడు. తర్వాత సిరా చుక్కను చెరిపి వేసి ధర్మారం మండల కేంద్రానికి వచ్చి 134 పోలింగ్ కేంద్రంలో ఓటు వేశాడు. అతడు రెండు చోట్ల ఓటు వేశాడని ఏజెంట్లు గుర్తించి ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి సత్యం రెండు పోలింగ్ బూత్‌లలో ఓటు వేశాడని నిర్ధారణ కావటంతో ఎఫ్ఎస్‌టి టీం అధికారి కె.చలపతి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.